క్లుప్తంగా

విద్యుత్ తీగలు చోరీ

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రి వెనుక సావిత్రమ్మ లేవుట్ పరిసర ప్రాంతంలో విద్యుత్ సరఫరా చేసే 11 కేజీల అల్యూమినియం వైర్లు మంగళవారం రాత్రి చోరీకు గురయ్యాయి. ఈ మేరకు మండల విద్యుత్ శాఖాధికారి శ్రీనివాసరావు బుధవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిల్వ నీరు..తొలగించేదెవరు?



చినపల్లిపేటలో గృహాల వద్ద నిలిచిన వర్షపు నీరు

గార: కళింగపట్నం పంచాయతీ చినపల్లిపేట వద్ద వర్షపునీరు నిలిచిపోవడంతో సమీప గృహాల్లో నివసిస్తున్నవారంతా అవస్థలు పడుతున్నారు. స్థానిక అమ్మవారి గుడి వద్ద దేవాలయ భూములు ఆక్రమణలకు గురికావడం, కాలువలు సైతం కప్పివేస్తుండటంతో ఈ పరిస్థితి వచ్చిందని బాధితులు కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిన తర్వాత ఎక్కువ రోజులు నిల్వ ఉండిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. పంచాయతీ, రెవెన్యూ అధికారులు తగు చర్యలు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

నిత్యాన్నదానానికి రూ.2లక్షల విరాళం



దాతలకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన శివాని, శేఖర్‌లు వేర్వేరుగా మొత్తం రూ.2 లక్షల విరాళాన్ని సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి సమక్షంలో ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణకు విరాళ నగదు బుధవారం అందజేశారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక దర్శనాలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, నేతేటి హరిప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

రణస్థలం: మెంటాడ పంచాయతీ దోనిపేట గ్రామానికి చెందిన మైలపల్లి రాజ్‌కుమార్ అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమపేరుతో నమ్మించి ఈ నెల 4న తనతో తీసుకెళ్లిపోయాడు. బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం రాజ్‌కుమార్‌ను పట్టుకుని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

టేబుల్ టెన్నిస్ కోర్టు ఏర్పాటుకు విరాళాలు



టీటీ కోర్టు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: శాస్త్రులపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో టేబుల్ టెన్నిస్ కోర్టు ఏర్పాటు నిమిత్తం విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం రూ.15 వేలు విరాళాన్ని ప్రిన్సిపాల్ జయశ్రీకి అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు పిన్నింటి ఎర్రయ్య, నాగరాజు, నారాయణరావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

లంకపేట విద్యార్థికి బీవైసీ స్కాలర్‌షిప్



స్కాలర్‌షిప్ అందుకుంటున్న హేమని

రణస్థలం: లంకపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి 569 మార్కులు సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన హేమనికి యూత్ క్లబ్ ఆఫ్ బెజ్జిపురం(బీవైసీ) నిర్వాహకులు రూ.పదివేల స్కాలర్‌షిప్‌ను డీఈఓ రవిబాబు చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిని హెచ్‌ఎం రాంబాబు, ఉపాధ్యాయులు కెల్ల రమణ, పందిరి రమణ, రమేష్, విశ్వ ప్రసాద్, లక్ష్మణరావు, వెంకటప్పడు, పూర్ణావతి, రాంబాబు, శైలజ, ప్రసన్న కుమార్, జగన్నాథం, శైలజ అభినందించారు.

నిర్మిత కేంద్రంపై నిర్లక్ష్యం

- గతంలో సిమెంట్ కిటికీలు, ద్వారాలు తయారీ
- పాలకుల నిర్లక్ష్యంతో తుప్పపడుతున్న యంత్రాలు
- గృహ లబ్ధిదారులు తప్పని ఇబ్బందులు



తుప్పు పట్టిన నిర్మిత కేంద్రం గేటు

ఎచ్చెర్ల :

ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులకు సిమ్మెంట్ ఇటుకలు, ద్వారాలు, కిటికీలు తయారుచేసి తక్కువ ధరకు అందించేందుకు ప్రభుత్వం ఎచ్చెర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నిర్మిత కేంద్రం మూలకు చేరింది. ఇక్కడ తయారైన ఇటుకలు, కిటికీలు, ద్వారాలను గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులకు అందించి నగదును లబ్ధిదారులకు ప్రభుత్వం చెల్లించే బిల్లులో మినహాయించుకునేవారు. ఇక్కడ నాణ్యమైన ఇటుకలు లభించడమే కాకుండా ముందస్తు ఎటువంటి నగదు చెల్లించకుండా పనులు సాగేవని ఆనందించేవారు. ఇప్పుడు ఈ కేంద్రాన్ని పూర్తిగా మూసి వేశారు. గతంలో కార్మికులు లేని సమయంలో మూసేసివారు. మరలా లేబర్ దొరికితే తెరిచేవారు. అయితే గత కొన్నాళ్లుగా ఈ కేంద్రాన్ని పూర్తిగా మూసివేశారు. దీంతో లక్షలాది విలువ చేసే సిమ్మెంట్ పరికరాలు తయారుచేసే యంత్రాలు తుప్పు పట్టిపోతున్నాయి.

అడవిని తలపిస్తూ..

ఎచ్చెర్లలోని నిర్మిత కేంద్రంపై నిర్లక్ష్యం వహించడంతో పరిసరాలు అడవిని తలపిస్తున్నాయి. ఇక్కడి యంత్రాల చుట్టూ పిచ్చిమొక్కలు, చెట్లు పేరుకుపోయాయి. గేట్లు తుప్పుపట్టిపోతున్నాయి. లక్షలాది విలువ చేసే మిషన్లు పూర్తిగా పాడయ్యాయి. మండల కేంద్రంలో ఇలా వృథాగా ఉన్న నిర్మిత కేంద్రాన్ని అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



అడవిని తలపిస్తున్న నిర్మిత కేంద్రం

బయట అధిక ధరలకు..

నిర్మిత కేంద్రం మూసి వేయడంతో సిమ్మెంట్ ఇటుకలు, కిటికీల బయట వ్యక్తుల వద్ద అధిక ధరలను చెల్లించి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. ఇక్కడ తక్కువ ధరకు నాణ్యమైన ఇటుకలు, కిటికీలు, ద్వారాలు లభించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలి.

– పి.ఈశ్వరరావు, కేశవరావు, ఎచ్చెర్ల మండలం

బిల్లులో మినహాయించేవారు..

ఇంటి నిర్మాణాలకు అవసరమైన సిమెంట్ ఇటుకలను లబ్ధిదారుల నుంచి ఎటువంటి రుసుం తీసుకోకుండా ముందుగా అందించేవారు. దీంతో నిర్మాణాలు జోరుగా సాగేవి. ఆ నగదును బిల్లులో మినహాయించుకునేవారు. దీంతో అప్పులు చేయాల్సిన బాధ ఉండేది కాదు. ఇప్పుడు నిర్మాణాలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– జి.రాములమ్మ, మురపాక, లావేరు మండలం

వైఎస్సార్‌సీపీలో చేరిక



మాజీ ఎంపీటీసీ నందీశ్వరరావును ఆహ్వానిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం : పైడిభీమవరం పంచాయతీ చిట్టివలసకు చెందిన మాజీ ఎంపీటీసీ గుడివాడ నందీశ్వరరావు, సీరపు సీతయ్య, ఇనుకోటి రాంబాబులు టీడీపీని వీడి బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ వైఎస్సార్‌సీపీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. పైడిభీమవరంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిరణ్ మాట్లాడుతూ రెడ్ బుక్ రాజ్యాంగం వల్ల ప్రజలతో పాటు ఆ పార్టీ నాయకులు కూడా తీవ్ర ఇబ్బందులు పడి అందులో ఇమడలేక వైఎస్సార్‌సీపీ వైపు చూస్తున్నారని చెప్పారు. పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ పిన్నింటి సత్యంనాయుడు, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లంకలపల్లి ప్రసాదరావు, ఎంపీటీసీలు ఆకల శ్రీనివాసరావు, మునకాల దుర్గారావు, గ్రామ నాయకులు బావిశెట్టి రమేష్, సీతారామయ్య, నారాయణప్పారావు, కాజా సంతోష్, కాజా రమణ, పైడి చంద్రరావు, విజయశాంతి ఉన్నారు.

నేడు సంతకాల సేకరణ

జి.సిగడాం: కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ జగనన్న ఆదేశాల మేరకు గ్రామాల్లో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమానికి ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరవుతారని మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వెంకయ్యపేట, జగన్నాథవలస, జాడ, ముషినివలస, డి.ఆర్.వలస గ్రామాల్లో జరిగే కార్యక్రమంలో కిరణ్ పాల్గొంటారని పేర్కొన్నారు.

వైద్య సిబ్బంది నిరసన



బాతువలో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

జి.సిగడాం: మండలంలోని బాతువ, జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద వైద్యసిబ్బంది బుధవారం నిరసన వ్యక్తం చేశారు. వైద్యుల సమ్మెకు మద్దతుగా నల్లబ్యాడ్జీలు ధరించారు.

ఘనంగా నందెన్న అనుపోత్సవం



నందెన్న, గౌరమ్మల ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని నక్కవీధి ఉమాజలేశ్వరస్వామి దేవాలయంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న నందెన్న ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నందెన్న, గౌరీదేవిలను ఊరేగించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మహేష్, బి.అశ్వినికుమార్, మహిళలు పాల్గొన్నారు.

కావాలని తప్పు చేస్తే ఉపేక్షించవద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గార:

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన చిన్న తప్పుల్ని బూతద్దంలో చూపవద్దని, అదే సమయంలో కావాలని తప్పులు చేస్తే క్షమించవద్దని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం గార మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో వేతనాలు, పంచాయతీరాజ్ ద్వారా ఖర్చు చేసిన రూ.27 కోట్ల 35 లక్షలకు సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేపట్టి ప్రజావేదిక నిర్వహించారు. ఇరిగేషన్ అధికారులు హాజరుకాకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి పీడీ లవరాజు మాట్లాడుతూ గత ఏడాది సోషల్ ఆడిట్‌లోని రికవరీలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీలు శైలజ, లోకేష్, హెచ్‌ఆర్ శ్రావణి, తహశీల్దార్ ఎం.చక్రవర్తి, ఎంపీడీవో ఈ.రఘు తదితరులు పాల్గొన్నారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ పీడీ విమల

శ్రీకాకుళం అర్బన్: బాలికలు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు ఐ.విమల అన్నారు. శ్రీకాకుళం గుజరాతిపేటలోని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ కార్యాలయ ఆవరణలో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం, పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్ట్ అధికారిణి పి.నాగరాణి, ఐసీడీఎస్ జిల్లా నోడల్ అధికారి మణెమ్మ, మిషన్ వాత్సల్య జిల్లా కో–ఆర్డినేటర్ ఉమామహేశ్వరి, అంగన్‌వాడీ పర్యవేక్షకులు పి.సీతామహాలక్ష్మి, కె.కల్యాణి, బి.యశోద, బి.యోగేశ్వరి, సీనియర్ సహాయకులు హరికృష్ణ, బీపీసీ గజలక్ష్మి, డీఈఓ సుధ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతు కుదేలు

- భారీగా పడిపోయిన ధర
- కొంపముంచిన వర్షాలు
- పిక్కలను రోడ్డుపైనే ఆరబెడుతున్న రైతులు



బాతువ గ్రామం వద్ద రోడ్డుపైనే జొన్నలు



గెడ్డకంచరాం -ఎందువ గ్రామాల రహదారిలో ఆరబెట్టిన మొక్కజొన్న

జి.సిగడాం :

మొక్కజొన్న రైతులు కుదేలయ్యారు. పంట చేతికి వచ్చిన సమయంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు తీరని నష్టాన్ని మిగుల్చుతున్నాయి. పంటంతా ప్రస్తుతం రోడ్లపైనే ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మొక్కజొన్న క్వింటా ధర గతంలో రూ.2400 ఉండేది. ప్రస్తుతం రూ.1900కు ధర పడిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, ఈసారి మదుపులకే పంట ధర సరిపోయేలా ఉందని ఆందోళన చెందుతున్నారు. ఒక్క సిగడాం మండలంలో సుమారు 6 వేల ఎకరాల్లో సాగు చేశారు. పంట కోతకు వచ్చిన సమయంలో వరుణుడు ఇబ్బందులకు గురిచేయడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు ఆపసోపాలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

పిక్కలు మొలకెత్తాయి..

రెండు ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశాంపంట బాగానే పండింది. ఇంతలో వర్షం కురవడంతో పిక్కలు మొలకెత్తాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పంటను కాపాడుకునేందుకే సరిపోతోంది.

– పెద్దలెంక లక్ష్మి, రైతు, జి.సిగడాం

మదుపులకే..

ఈ ఏడాది మొక్కజొన్న సాగు కలిసి రాలేదు. చేతికి వచ్చిన పంట సరిగా రాలేదు. పంటంతా రోడ్లపైనే ఆరబెడుతున్నాం. ఓవైపు కూలీ రేట్లు, మరోవైపు ఎరువులు రేట్లు పెరగడంతో వచ్చే పంట మదుపులకే సరిపోతోంది.

– ఎం.రాములు, రైతు, బాతువ

మార్కెట్లో ధర లేదు

గతంలో మొక్క జొన్న క్వింటా ధర రూ.2400 వరకు ఉండేది. ప్రస్తుతం ధర రూ.1900 నుంచి రూ.2000కే పరిమితమైంది. ఇలాగైతే వ్యవసాయం చేయడం కష్టం. పాలకులు స్పందించి రైతులకు చేయూతనిచ్చేలా కార్యక్రమాలు చేపట్టాలి.

– ఎస్.లక్ష్మణరావు, రైతు, ఎందువ

వైద్య కళాశాలలపై కూటమి కుట్రలు



రణస్థలం: కోటి సంతకాల కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తదితరులు



శ్రీకాకుళం రూరల్: మాట్లాడుతున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

రణస్థలం: మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కోటి సంతకాల ప్రజా ఉద్యమం ప్రజలు ఉత్సాహంగా ముందుకు రావడం అభినందనీయమని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. పైడిభీమవరం, నెలివాడ, పతివాడపాలెం పంచాయతీల్లో బుధవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల విద్యకి, ఆరోగ్యానికి ఇబ్బంది కాకుడదనే ఉద్దేశంతో మెడికల్ కళాశాలలను నిర్మిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని ప్రయివేటు పరం చేస్తూ నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ పిన్నింటి సత్యంనాయుడు, నాయకులు పాశపు ముకుందరావు, టేకి లక్ష్మణరావు, లంకలపల్లి ప్రసాదరావు, ఆకల శ్రీనివాసరావు, మునకాల దుర్గారావు, పతివాడ శ్రీరామ్‌మూర్తి, రెడ్డి విశ్వేశ్వరరావు, పతివాడ సత్యం, బొంతు వెంకటేష్, కొలగాన రమణ, రెడ్డి సత్యమప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలను తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రను అడ్డుకునేందుకు కోటి సంతకాలు సేకరణలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని వైఎస్సార్ సీపీ యువ నాయకులు ధర్మాన రామ్మనోహర్‌నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం ధర్మాన క్యాంపు కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు, యువతతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్ష్యపూరిత పాలన, స్వార్థ రాజకీయాలను తరిమికొట్టేలా కోటి సంతకాలు సేకరణ శ్రీకాకుళం నియోజకవర్గంలోని ప్రధాన కేంద్రాల్లో నిర్వహించేందుకు రెండు మూడు రోజుల్లో పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి షెడ్యూల్ వస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వెలమ సంఘం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దన్‌రావు, గార మాజీ ఎంపీపీ పి.నాగేశ్వరరావు, టౌన్ అధ్యక్షుడు సాధు వైకుంఠం, జిల్లా యువజన అధ్యక్షుడు మార్పు పృథ్వీ, పార్టీ నాయకులు చిట్టి రవికుమార్, కోణార్క్ శ్రీను, రుప్ప అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.



లావేరు మండలం గుంటుకుపేటలో సంతకాల సేకరణ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రణస్థలం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని వైఎస్సార్ సీపీ లావేరు మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు పిలుపునిచ్చారు. లావేరు మండలం పెదరావుపల్లి, గుంటుకుపేట, మురపాక, చిన్నయ్యపేట కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం పోరాటం నిర్వహించారు. కార్యక్రమంలో లావేరు జెడ్పీటీసీ సభ్యులు మీసాల సీతంనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గొర్లె అప్పలనాయుడు, మహిళా అధ్యక్షులు విజయలక్ష్మి, నాయకులు పెయ్యల లక్ష్మణరావు, కొన్ని పరసయ్య, కూనపు పోలీసు, ఆరంగి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ ఔదార్యం



కృష్ణమూర్తిని సన్మానిస్తున్న గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: పోలీస్ ఉద్యోగంలో కానిస్టేబుల్‌గా చేరినప్పటి నుంచి 30 ఏళ్ల పాటు ప్రతి నెలా తన జీతంలో 20 శాతం పేదలకు పలు రూపాల్లో సహాయమందిస్తూ నేటికీ ఆ స్ఫూర్తిని కొనసాగిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లా హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తిని శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, గాంధీ మందిర ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కలాం జయంతి సందర్భంగా నగరంలోని గాంధీ మందిరం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి మిత్ర బృందం, గాంధీ మందిర ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పకడ్బందీగా ఈ–క్రాప్ నమోదు

జి.సిగడాం: ఈ–క్రాప్ నమోదు పక్కాగా చేపట్టాలని వ్యవసాయాధికారి బెండి బాబ్జీ సూచించారు. బుధవారం జి.సిగడాం రైతుసేవా కేంద్రంలో క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఏఈఓలు సింహాద్రి లీలామోహన్, కొమ్ము అప్పారావు, తిర్లంగి మాధవి, ముంతా హేమంత్, కుమరాపు సుగణకరావు, తలచింతల కుసుమ పాల్గొన్నారు.

జీవన ఎరువులపై అవగాహన

రణస్థలం : రైతులు జీవన ఎరువులపై అవగాహన ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. కమ్మసిగడాంలో కృషి విజ్ఞాన కేంద్రం, ఆమదాలవలస ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు జీవన ఎరువులపై అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ పి.తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ హుండీ ఆదాయం రూ.1.21 లక్షలు

శ్రీకాకుళం కల్చరల్: పాత బ్రిడ్జి రోడ్డులోని కనకదుర్గ అమ్మవారి దేవాలయం హుండీల ఆదాయం రూ.1,21,996 వచ్చినట్లు ఈఓ శ్యామలరావు తెలిపారు. 106 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని చెప్పారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఈఓ సుకన్య, ఆలయ ధర్మకర్త, అర్చకులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాండురంగ వీధిలో వివేక్ సదన్ వద్ద ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యవాహ వసంతరావు, శరత్‌బాబు, టి.నీరజలు మాట్లాడుతూ హిందూ ధర్మంలో సామాజిక సమరత, కుటుంబ వ్యవస్థ, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ, పౌరనియమాల పరిరక్షణకు ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తుందని చెప్పారు.

పౌష్టికాహారం తప్పనిసరి

జి.సిగడాం: గర్భిణులు, బాలింతలు, కిశోరీ బాలికలు పౌష్టికాహారం విధిగా తీసుకోవాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి కోరారు. బుధవారం గెడ్డకంచరాంలో పౌష్టికాహార మాసోత్సవాలు సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

కార్యక్రమంలో సర్పంచ్ పంచిరెడ్డి శ్యామలరావు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంకు అభినందనలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వచ్ఛ ఆంధ్ర–2025 రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్న నేలబొంతు ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం బి.విజయ భారతిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ బుధవారం అభినందించారు. ఇటీవల విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఈమె అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు అన్నదొరై తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్లకు సత్కారం



జి.సిగడాం: స్థానిక మోడల్ పాఠశాల తెలుగు అధ్యాపకుడు కోట తిరుపతిరావు, గణితం అధ్యాపకుడు తూముల జగదీశ్వరరావు ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా వీరికి బుధవారం ప్రిన్సిపాల్ డబ్బీరు గణేష్ పట్నాయక్, పాఠశాల కమిటీ చైర్మన్ ప్రతినిధి భూపతి అర్జున్‌కుమార్ సమక్షంలో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, పిచ్చిక నేతాజీ, ముత్యాలరావు, అరుణకుమారి, నాగమణి, ప్రమీల, జ్యోత్స్న, నరసయ్య, ఆదినారాయణ, జగదీష్, దుర్గారావు, ధనలక్ష్మి, సతీష్, వైకుంఠరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



శ్రీకాకుళం కల్చరల్:ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో బుధవారం జీఎస్టీ ఉత్సవ్‌లో భాగంగా నిర్వహించిన సాంస్కృతికోత్సవం ఆకట్టుకుంది. అభినయ నృత్యనికేతన్ నీరజా సుబ్రహ్మణ్యం బృందం ఆధ్వర్యంలో కోయడ్యాన్సులు, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అలరించాయి.

స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలాం

శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా, అధ్యాపకునిగా సేవలను అందించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నిడారంబర జీవన పయనం, పాటించిన విలువలు, దేశభక్తి నేటి యువతకు ఆదర్శనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా బుధవారం కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎచ్చెర్ల: ఎస్‌ఎంపురం ట్రిపుల్ ఐటీలో..



ఎచ్చెర్ల: బి.ఆర్.అంబేడ్కర్ వర్సిటీలో..



శ్రీకాకుళం పాతబస్టాండ్ జ్యోతిరావుపూలే పార్కులో..



శ్రీకాకుళం అర్బన్ అక్షర స్కూల్లో విద్యార్థి దినోత్సవం